కథ

# జ్ఞానోదయం

- వలివేటి నాగచంద్రావతి

శ్రీ శంకర భగవత్పాదులవారి జీవితచరిత్ర కమనీయంగా, కడురమ్యంగా, నాస్తికుడి మనసులోనైనా ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా వినిపిస్తోంది... టెలివిజన్ సెట్‌లోంచి.

వెళ్తున్న దారిలో నాలుగు కుక్కలతో ఎదురొచ్చిన పంచముణ్ణి 'తొలగు తొలగు' అంటున్నారు శంకరులు. 'నీలోనూ నాలోనూ ప్రకాశిస్తున్నది ఒకే ఆత్మ అయినప్పుడు నీనుంచి నేనెలా వేరుకాగలనయ్యా' అని ప్రశ్నిస్తున్నాడు పంచముని రూపంలో ఉన్న సాక్షాత్ పరమేశ్వరుడు. అజ్ఞానం తొలగి శంకరుడాయనకు సాష్టాంగపడ్డారు.

కథ కథనానికి సశేషం పడింది.

"ఆహాహా... విన్నావా సుమిత్రా, నువ్వనీ నేననీ తేడాలేదనీ లోకమంతటా నిండున్నది ఆ పరబ్రహ్మమేననీ అద్వైతబావానికి అర్థం ఆ పరమేశ్వరుడు ఎంత బాగా చెప్పాడోనూ" - తనకే జ్ఞానోదయమయిందన్నట్టుగా వెలిగిపోతున్న మొహంతో టీవీ ముందునుంచి లేచి వంటింట్లోకి వస్తూ అన్నారు మా అత్తగారు అలివేణమ్మగారు.

"మరే... మరే" అన్నాన్నేను గబగబా అంగీకరించేస్తూ.

నా మొహం... నేనేం విన్నానూ - మాంచి పనివేళాయే... ఓ స్టౌ మీద బాండీలో తిరగమోత మాడిపోతోంది. దాన్లో వెయ్యాల్సిన కూర తరగటం పూర్తికాలేదింకా. ఆ పక్క స్టౌ మీద కుక్కరు విజిల్ మీద విజిలొచ్చేస్తోంది. కచ్చితంగా లెక్క పెట్టకపోతే పప్పుడికి చావదు. గంటలో క్యారియర్లు సర్దెయ్యాలి.

ఈ హడావుడి చాలదన్నట్టు ఇందాకట్నుంచీ నా కూతురు అరవింద, 'నా కెమిస్ట్రీ రికార్డ్ కనబడ్డంలేదు, నువ్వు చూశావా... నువ్వు చూశావా?' అని అందర్నీ నిలదీస్తూ ఇల్లంతా కదం తొక్కేస్తోంది, తల్లకిందులు చేసేస్తోంది. 'అమ్మా అమ్మా, వెతికిపెట్టవా' అని అరిచేస్తోంది. నా గారాల పుత్రరత్నమేమో 'అమ్మా, ఈ రాక్షసి నా అలమారెలా కెలికేసిందో చూడు. నా బ్యాగెలా బోర్లించేసిందో చూడు' అని రంకెలు పెడుతూ చిందులేస్తున్నాడు. ఈ గడబిడంతా మామూలేనన్నట్టు ఏమాత్రం పట్టించుకోకుండా మా మామగారు, 'అమ్మాయ్, పేపరు కుర్రాడు విసిరేసిపోయాడమ్మా. ఎక్కడ పడిందో ఏమిటో కాస్త చూసిఇద్దూ' అని రిక్వెస్ట్ చేస్తున్నారు. 'ఏమోయ్... నెట్టు ఓపెన్ చేసుంచు. నేనొచ్చేస్తున్నా'... ఇది బాత్‌రూమ్‌లోంచి నా పతిదేవుడి ఆర్డరు.

ఇంత గందరగోళం మధ్యన ఉరుకులూ పరుగుల నేపథ్యంలో టీవీ వాల్యూం ఎంత పెంచిపెడితే మాత్రం ఆత్మ తత్వచింతన, బ్రహ్మజ్ఞాన బోధన విన్నావా, బుర్రకెక్కించుకున్నావా అనడిగితే ఏం చెప్పను?

ఇలాంటప్పుడే నాకు మా అత్తగారిని చూస్తే జలసీ అనిపిస్తుంది. 'తీరికగా ఏ బాదరబందీ లేకుండా బాల్కనీలో పూలమొక్కల్ని పరామర్శిస్తూ, భక్తి చానల్‌లో ఏ ప్రోగ్రాం మిస్సవకుండా చూసుకుంటూ, దేవుడి పటాలకోసం పూలదండలు కట్టుకుంటూ ఎంత హాయిగా గడిపేస్తోందో ఈవిడ- అని.

తీరా ఆవిడ నా దగ్గరగా వచ్చి 'అంత పనీ ఒంటిచేత్తో చేసుకుంటావ్ పిచ్చిపిల్లా! అదిలాతే... నేను మిక్సీ వేసి పెడతా' అననంగానే పశ్చాత్తాపం మొదలైపోతుంది. 'పాపం నిన్నమొన్నటిదాకా మరుదులూ ఆడపడుచులూ ఉన్న ఉమ్మడి సంసారంలో ఆవిడ కూడా ఊపిరి సలపని పనులతో అష్టావధానం చేసిన మనిషే గదా. పోన్లే ఇప్పుడైనా కాస్త విశ్రాంతిగా ఉండనీ. మంచి విషయాలపైన మనస్సుంచనీ' అనుకుంటాను.

పది గంటలయింది. స్కూళ్ళకీ ఆఫీసులకీ వెళ్ళాల్సినవాళ్ళంతా వెళ్ళిపోతే ఇంట్లో గాలివాన వెలిసిన వాతావరణం వచ్చేస్తుంది. అత్తమ్మ పూజకి కూర్చున్నారు. తుపాను తాకిడికి కకావికలైన వస్తువుల్ని సర్దుకుంటున్నాన్నేను.



కాలింగ్‌బెల్ మోగింది.

కర్పూరం వెలిగించి గంట మోగిస్తున్నారత్తమ్మ. "పూజ అయిందిలే, నేను వెళ్ళి చూస్తా" అన్నారు.

ఇందాక అరవింద అల మార్లోంచి బట్టలన్నీ లాగి కుప్పలా పోసింది. అవి మడతలు పెట్టుకుంటూ "సరేలెండి" అన్నా, 'అమ్మయ్య' అని ఊపిరి పీల్చుకుంటూ.

వీధితలుపు తీయటానికి వెళ్ళి అయిదు నిమిషాల్లో వెనక్కొచ్చారత్తమ్మ. "ఎలక్షను కోసం ఏవో జనాభా లెక్కలట. ఆ అమ్మాయి చెప్పమన్న వివరాల లిస్టు చాంతాడంతుంది. నావల్ల కాదు... నువ్వే వెళ్ళు" అన్నారు విసుగ్గా మొహం చిట్లించి.

తప్పదిక. తరగని ఆ బట్టలపోగు వంక చూసి నిట్టూరుస్తూ లేచి వెళ్ళాను.

చేతిలో లావుపాటి బైండ్‌బుక్, కాగితాలేవో క్లిప్‌చేసి పెట్టిన ప్యాడ్ పట్టుకుని గుమ్మం అవతల నిలబడుంది ఆమె. నన్ను చూడగానే "లోపలికి రావచ్చా మేడమ్" అంది చిరునవ్వుతో.

నిదానించి చూశాను. చామనఛాయ, మెరుగ్గా ఉన్న పెద్ద కళ్ళు, గడ్డంకింద ఉలిపిరి కాయలా కనిపిస్తున్న కాస్త పెద్ద పుట్టుమచ్చ, పొట్టిగా దుబ్బుగా ఉన్న నొక్కులజుట్టూ... 'ఆ పోలికలూ అవీ ఎవరివి చెప్మా.' మెరుపులాగా గుర్తుకొచ్చేసింది.

"వెల్‌కమ్ మైడియర్ రెయిన్‌బో" ఆనందాన్ని దాచుకుంటూ, గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ ఆహ్వానించాను.

ఆమె నుదుటిమీద సన్నని ముడతలు పడ్డాయ్ - గతంలోకి తొంగిచూస్తున్నట్టు. మరుక్షణం ఏవో జ్ఞాపకాలని ఒడిసిపట్టుకున్నట్టు కళ్ళు ఇంకాస్త పెద్దవైనాయ్. "మీరు... నువ్వు సుమిత్రవి కదూ" అంది సంభ్రమంగా. ఆత్మీయంగా తనని పొదవి పట్టుకుని లోపలికి తీసుకువచ్చాను.

మేమిద్దరం ఒకప్పటి స్నేహితులం. నేను జూనియర్ కాలేజీలో చదివేటప్పుడు తను నా క్లాస్‌మేట్. తనకి రంగులంటే పిచ్చి ఇష్టం. రంగురంగుల పువ్వుల్ని నోట్‌బుక్ పేజీల్లో ప్రెస్ చేసి పెట్టుకునేది. ఒక బాక్స్ నిండా కలర్ పెన్సిళ్ళుండేవి తన దగ్గర. తీరిక దొరికితే చాలు వాటితో ఏవేవో బొమ్మలు గీస్తూ ఉండేది. ముఖ్యంగా ఇంద్రధనుస్సు. అంచేతే తన నిక్‌నేమ్ రెయిన్‌బో అయిపోయింది క్లాసులో.

నాజూగ్గా, అమాయకంగా ఉండే ఆ అమ్మాయంటే నాకెందుకో చాలా ఇష్టంగా ఉండేది అప్పట్లో. రెండేళ్ళ మేము కలిసి చదువుకుంది. ఆ తర్వాత ఎవరిలోవ వాళ్ళదయిపోయింది. ఇన్నేళ్ళకి చిత్రంగా మళ్ళీ ఇలా కలిశాం.

పట్టుచీర విప్పగానే మడతల్లో దాచిన దవనం గుబాళించిపోతూ బయటపడ్డట్టు తనని చూడగానే వెనకటి రోజులన్నీ కళ్ళ ముందు కదలాడినట్టయింది.

తను ఈ ఊళ్ళోనే టీచర్‌గా వర్క్ చేస్తోందట. "డ్రాయింగ్ టీచర్‌గానా? ఇంకా ఇంద్రధనుస్సులు వేస్తూనే ఉన్నావా?" అన్నాను కొంటెగా.

"అహహ... అబ్బెబ్బే... లేదులేదు... నువ్వు బలేదానివి" కొంచెం బిడియపడుతున్నట్టు తడబడింది తను. అదే నెమ్మదితనం. అదే మొహ

మాటం. తనవైపు అభిమానంగా చూశాను.

"కాఫీ కలుపుకొస్తానుండు. తాగుతూ మాట్లాడుకోవచ్చు" లేవబోతుంటే చెయ్యిపట్టుకు ఆపేసింది.

"ఇప్పుడవేమీ వద్దు సుమిత్రా. నా పనింకా పూర్తికాలేదు. ఇల్లు తెలిసిందిగా... ఇంకోసారొస్తాను. ఓ గ్లాసు మంచినీళ్ళు మాత్రం ఇవ్వు చాలు" అంది.

అప్పుడే మా దగ్గరకు రాబోతున్నారత్తమ్మగారు. మేం చనువుగా మాట్లాడుకోవటం విన్నట్టున్నారు. "నేను తెస్తాలే నువ్వు కూర్చో" అంటూ వెనక్కి తిరిగారు. ఇలాంటప్పుడు మా అత్తగారంటే నాకెంత ఇష్టంగా ఉంటుందో.

సమయం వృథాకానీకుండా నన్ను ప్రశ్నలడుగుతూ పేపర్ల మీద వర్క్ మొదలుపెట్టేసింది నా ఫ్రెండ్. అత్తమ్మ ట్రేలో గ్లాసుతో వచ్చారు. నేను పరిచయం చేశాను. "తను నా ఫ్రెండే అత్తమ్మా. ఈ ఊళ్ళోనే టీచర్‌గా చేస్తోందట. మేము రెయిన్‌బో అనేవాళ్ళంగానీ తన పేరు..." చెప్పడం పూర్తయిందో లేదో ట్రేలో గ్లాసుతీసి చెయ్యి చాచి నా ఫ్రెండ్‌కి అందివ్వబోతున్న అత్తమ్మ షాక్ కొట్టినట్టు చెయ్యి వెనక్కి తీసుకున్నారు.

ఏమయింది? తెల్లబోయాన్నేను.

"అహ, ఏం లేదు... గ్లాసులో నలక ఉన్నట్టుంటేనూ - మార్చి తీసుకొస్తానుండు" తొణక్కుండా చెప్పారత్తమ్మ. ఆవిడ ఉలికిపాటుని నేను కనిపెట్టలేదనుకున్నారుగానీ నా దృష్టిని దాటిపోలేదది.


రెండు నిమిషాల్లో మళ్ళీ తెచ్చారు నీళ్ళు - ఈసారి గాజుగ్లాసులో. ఆ గ్లాసు అత్తమ్మ ఎవరికోసం వేరేగా పెడతారో తెలుసు నాకు. వేదనని మించిన గ్లానితో హృదయం మ్లానమయింది. దేవరిస్తున్న మొహాన్ని పక్కకు తిప్పుకున్నాను. ఇక మనసువిప్పి తనతో ఎలా మాట్లాడగలను?

కామ్‌గా మంచినీళ్ళు తాగి, పని పూర్తిచేసేసింది తను. వెళ్ళటానికి లేచినప్పుడు నా చేతిని తన చేతిలోకి తీసుకుని నొక్కింది "ఫర్‌గెటిట్ సుమిత్రా" అంది.

తనకి అర్థమయిపోయిందన్నమాట - నా కళ్ళు చెమ్మగిల్లాయి.

ఆ తర్వాత అత్తమ్మతో చాలా సేపటిదాకా సరిగ్గా మాట్లాడలేకపోయాను. గ్రహించారత్తమ్మ. చాలా రకాలుగా నన్ను కన్విన్స్ చేయాలని ప్రయత్నించారు. చివరికి "నువ్వే మన్నా అనుకో అమ్మాయ్, కుడిచేతికీ ఎడంచేతికీ తేడా వద్దంటే నేను ఒప్పుకోను. అయినా ఇవి ఈరోజు నేను సృష్టించినవా... ఆ కృష్ణపరమాత్మే 'చాతుర్వర్ణం మయా సృష్టం' అన్నాడు. అదేగదా నేను పాటించింది. నా తప్పేమిటి? " అని నిలదీశారు.

విస్తుపోయాను. ఇందాక అద్వైతార్థాన్ని మెచ్చుకున్నదీవిడేనా? రెండు నాలుకల ధోరణంటే ఇది కాదూ. కానీ కానీ... రాజీపడ్డం తప్ప పోరాడే స్వభావం కాదు నాది. 'ఇలాంటివాళ్ళకు కాలమే పాఠం నేర్పాలి' అనుకున్నాను. నిట్టూర్చాను. తలవంచాను.



★ ★ ★

సంక్రాంతి దగ్గరపడుతోంది. పండక్కని పిల్లలూ మగవాళ్ళూ ముందుగానే రెడీమేడ్‌లో బట్టలు తెచ్చేసుకున్నారు. ఇక నేనూ అత్తమ్మానే మిగిలాం.

"పని తొందరగా తెముల్చు సుమిత్రా, షాపింగ్‌కి వెడదాం. కళానికేతన్‌లో కొత్త స్టాకొచ్చిందట" అన్నారత్తమ్మ. సరే, ఇంటిపని ఆఖరవటం అంటూ ఉంటుందా ఎక్కడైనా. కామా పెట్టి బయల్దేరాం.

ఆ బట్టలషాపులో కలిశారు మాకు లలితాంబగారు. ఆవిడ మా అత్తగారి మేనత్త తోటికోడలు చెల్లెలికి... ఒద్దులెండి. ఆ బీరకాయపీచు బంధుత్వం చెప్పడం నావల్ల కాదు. ఆ మాట బయటకు అన్నానంటే నా పని అయిపోయిందే. 'ఏమిటే - బీరకాయపీచా - చాల్లే ఊరుకో. ఆవిడ మాకెంత దగ్గర చుట్టమో తెలుసా. మా పుట్టింట్లో ఏ చిన్న శుభకార్యమైనా వాళ్ళంతా వచ్చేసేవాళ్ళు మేమూ అంతే. ఓ తల్లిబిడ్డల్లా కలిసిపోయుండేవాళ్ళం. ఏమనుకున్నావో' అని వాయించుండేవారు మా అత్తమ్మ. ఇంతకీ వాళ్ళిద్దరూ వదినా మరదళ్ళవుతారట.

మేము కాటన్‌చీరల విభాగంలో ఉంటే ఆవిడ పట్టుచీరల వింగ్‌లోనుంచి మమ్మల్ని చూసిందట. "వేణీ, బావున్నావా? " అంటూ దగ్గరకొచ్చేసింది. మా అత్తగారి మొహం చాటంతయింది.

"నేను నీకు చెప్పలేదూ- మా లలితాంబ వదిన ఈ ఊళ్ళోనే ఉంటున్నారనీ" నా వంక చూశారు పొంగిపోతూ.

చెప్పారా - ఏమో చెప్పే ఉంటారు. సంగతేమిటంటే మా మామగారు వ్యవసాయ కుటుంబంలో పుట్టారు. పొరపాటున ఆ ఒరవడి తప్పించి చదువుకుని ఉద్యోగస్థులయ్యారు. మా అత్తగారలాకాదు. 'మావాళ్ళకి మా అత్తవారిలా లోకమంటే నాగలీ కొడవలీ కాదు సుమీ. మా అమ్మవైపునా మా నాన్నవైపునా కూడా అంతా ఎడ్యుకేటెడ్ పీపులే. అంతా గెజిటెడ్ ర్యాంకుల్లోనూ పెద్దపెద్ద హోదాల్లోనూ ఉన్నవాళ్ళే. మా తాత సబ్‌కలెక్టర్. మా నాన్న తహసీల్దార్. మా మేనత్త భర్త ఫలానా... ఆవిడ బావగారు కూడా...' అంటూ తన పుట్టింటివారి ప్రాభవాన్ని తరచూ ఉటంకిస్తూనే ఉంటారు. బహుశా ఆ వరసలో ఎప్పుడో ఒకప్పుడు ఈ లలితాంబగారి నేమూ, డిజిగ్నేషనూ కూడా వచ్చే ఉంటాయి. చెప్పారన్నట్టుగా తలూపి ఆమెవైపు చూసి నమస్కారం చేశాన్నేను.

ఆ తరవాత వచ్చినపని పక్కనపెట్టి పది నిమిషాలపాటు ఆవిడ కబుర్లకి స్పెండ్ చేయక తప్పలేదు. ఆవిడది ఎంత లౌక్యమంటే ఆ పదినిమిషాల్లోనే వాళ్ళాయనగారి హైలెవల్ పొజిషన్ గురించీ వాళ్ళ ఆస్తీఅంతస్తూ గురించీ ఫారిన్‌లో సెటిలయిన తమ పిల్లల గురించీ ఎంత చాకచక్యంగా మాటల్లో చొప్పించి నాకు తెలియజెప్పిందనీ.

అలాంటి ప్రయోగాలు నాకు కాస్త తలనొప్పునిపించే మాట నిజమేగానీ ఏం చేయను? ఓపక్క ఆవిడ గొప్పలు చెప్పుకుంటుంటే ఇంకోపక్క మా అత్తగారు 'చూశావా, మావాళ్ళెంత ఎత్తునున్నారో' అన్నట్టు నాకేసి కళ్ళెగరేస్తున్నారయ్యె. ఇక చచ్చినట్టు ఓ చచ్చు నవ్వొకటి నవ్వక చస్తానా చెప్పండి.

ఆఖర్న లలితాంబగారన్నారు- "పద వేణీ, మా ఇల్లు చూద్దువుగాని. బయట పార్కింగులో కారుంది" అని.

అర్జంటుగా కలగజేసుకున్నాన్నేను. "కాదులెండి పిన్నిగారూ, మా సెలక్షనింకా పూర్తికాలేదు. టైంచూసుకుని మేమే వస్తాంలెండి" అన్నాను.

మా అత్తగారి చేతికి తమ విజిటింగ్ కార్డొకటి ఇచ్చి, తప్పకుండా రమ్మని మరోసారి చెప్పారు లలితాంబగారు.

అప్పట్నుంచీ వెళ్ళాలని ఒకటే తహతహ మా అత్తగారికి. చివరికోరోజున కుదిరింది. ఓ ప్రముఖ కంపెనీవాళ్ళు తమ ప్రోడక్ట్ ఎగ్జిబిషన్ కమ్ సేల్ పెట్టారంటే వెళ్ళాం. సాధారణంగా ఇలాటివాట్లకి నేనూ అత్తమ్మే కలిసి వెళ్తుంటాం.

ఎగ్జిబిషన్ నుంచి బయటకొచ్చేటప్పుడన్నారత్తమ్మ "లలితాంబవాళ్ళు ఉండేది ఈ ఏరి

## కలం కదిలించండి

సృజనాత్మకత కలిగిన రచయితలకూ రచయిత్రులకూ ఇదే ఆహ్వానం. మానవ జీవితంలోని విభిన్న పార్శ్వాలను స్పృశిస్తూ మధురమైన అనుభూతులను పాఠకులకు పంచే కథలకు 'ఈనాడు' స్వాగతం పలుకుతోంది. భావం ఏదైనా కథనంలో వైవిధ్యం, పాఠకులను [illegible] చదివించగలిగే బిగువూ ఉండాలి. ఆశావహ దృక్పథంతో సాగే కథలకు ప్రాధాన్యం. కథ సాధారణ చేతిరాతలో ఏడు అరఠావులకు మించకూడదు.

కథలు పంపాల్సిన చిరునామా:

**ఆదివారం అనుబంధం**
ఈనాడు కాంప్లెక్స్, సోమాజిగూడ,
హైదరాబాద్-82.

యానే కదూ... వెడదామా?" అని. కాదనలేక పోయాను.

అడ్రస్ కనుక్కోవడం కష్టం కాలేదు. లలితాంబగారు తమ ఐశ్వర్యం గురించి చెప్పిన మాట అతిశయోక్తి కాదు. బ్రహ్మాండమైన ఎలివేషన్‌తో రెండంతస్తుల భవనం వాళ్ళది. కోటగుమ్మంలోంచి పెద్దగేటు, తోయగానే 'ఎవరదీ' అంటూ పరిగెత్తుకొచ్చిన వాచ్‌మన్, మా రిలేషన్ చెప్పుకున్నాక లోపలికి వెళ్ళనిచ్చాడు.

మమ్మల్ని చూడగానే లలితాంబగారు చాలా సంతోషపడ్డారు. ఆప్యాయంగా అత్తమ్మ భుజం మీద చెయ్యేసి, ఇంకో చేత్తో నా చెయ్యి పట్టుకుని ముందు హాల్లోకి తీసుకువెళ్ళారు. చల్లటి నీళ్ళు తెప్పించి ఇచ్చి సేద తీర్చారు. ఆ తరవాత ఇల్లంతా తిప్పి వివరంగా చూపించారు.

వివరంగా అంటే- ఆ హాలు కొలత హండ్రెడ్ ఇంటూ హండ్రెడ్ అట. మమ్మల్ని కూర్చోపెట్టిన సోఫా ఖరీదు లక్షాయాభైవేల రూపాయలు. పైన వేలాడుతున్న షాండ్లియరూ డెకరేషన్ పీసెస్సూ ఇంకో రెండు లకారాలు. కింద పరిచిన కార్పెట్ పర్షియా నుంచి దిగుమతయింది. హాల్లోనే ఓ పక్కగా ఉన్న డైనింగ్ ప్లేసూ ఆ ఆర్చీ అదీ అలంకరించటానికి పట్టినకాలం మూడునెలలు. అత్యంతాధునికంగా ఉన్న కిచెన్‌లోని సామాగ్రీ, పడగ్గదుల్లోని పరుపులూ ఫర్నిచరూ దాదాపు అన్నీ ఫారిన్‌వేనట - అదీ సంగతి.

అత్తమ్మ సంగతేమోగానీ వినీవినీ చూసీ చూసీ నాకు అలసటొచ్చేసింది. పెదాలు సాగదీసి నవ్వుమొహం పెట్టీపెట్టీ చెంపలకి నొప్పులొచ్చేశాయ్. అప్పుడర్థమయింది... మేము వచ్చినందుకు ఆవిడ ఎందుకంత సంతోషపడ్డదో.

ఇక నాకు ఓపికలేదు. "ఇక వెడతాం" అన్నాను అత్తమ్మ అనుమతీసుకోకుండానే.

"అయ్యో అప్పుడేనా, రాకరాక వచ్చారు. మా ఇంట్లో టిఫినయినా తినకుండా వెళ్ళనిస్తానా" అన్నారు లలితాంబగారు. "ఇంకా మేడమీద గదులు చూపెట్టనేలేదు" అని ముక్తాయింపు ఇచ్చారు. "కస్తూరీ" అని వంటమనిషినిగావును, కేకేశారు.

ముందే చెప్పి ఉంచిందనుకుంటా - రెండు అందమైన పింగాణీ ప్లేట్లలో కాస్తంత కారా, చిప్స్, నాలుగు బిస్కట్లూ, గ్లాసుల్లో జ్యూసూ తీసుకువచ్చిందో అమ్మాయి.

అన్నట్టు ఆ ప్లేట్లు కూడా ఫారిన్‌వేనట. నేనూ అత్తమ్మా జ్యూసుగ్లాసులు చేతికి తీసుకున్నాం.

ఫోన్ మోగింది. రిసీవర్ ఎత్తారు లలితాంబగారు. వింటున్న వార్త విశిష్టత ఏమిటోగానీ ఆవిడ మొహంలో వెయ్యి క్యాండిల్స్ బల్బ్ వెలిగింది. "అలాగలాగే. అబ్బెబ్బే అస్సలాలస్యముండదు సరేనా. ఫోన్ పెట్టేస్తున్నా" అన్నారావిడ తొందరతొందరగా ఫోన్ పెట్టేస్తూ.

"విన్నావా వేణీ. ఎంపీ విశ్వనాథంగారు తెలుసునా నీకు. వారి ఫ్యామిలీ అరగంటలో ఇక్కడికొస్తున్నారట. మావారు ఫోన్ చేశారు తీసుకొస్తున్నానని. ఆయనా మావారూ మంచి దోస్తులు. ఎప్పట్నుంచో ఇంటికి రమ్మని పిలు



స్తున్నాం. ఇప్పటికి వీలయింది వాళ్ళకు" అత్తమ్మ మొహం చూడకుండానే సమాచారమందించేసి, "కస్తూరీ, మాణిక్యం ఎక్కడున్నారు?" పనివాళ్ళని పిలుస్తూ మాయమైపోయిందావిడ. అంతే మళ్ళీ మా మొహం చూళ్ళేదు. ఆవిడ కంఠం గట్టిదనం మాత్రం వినబడుతోంది. "ఆ కర్టెన్లు మార్చెయ్ కస్తూరీ. పరోటాపిండి కలుపు. ఫ్రిజ్‌లోంచి పనీరు తీసి కాస్త పెద్దముక్కలుగా కట్ చెయ్. మాణిక్యం, ఆ డ్రైవర్ని పిలూ... ఏం పళ్ళు తేవాలో చెబుతా" ఇలా ఆపకుండా పనులు పురమాయిస్తూనే ఉంది.

మేమలా కళ్ళప్పగించి చూస్తూండగానే డైనింగ్ టేబుల్ మీద చక్కటి అల్లిన క్లాత్ పరవబడింది. ఫ్రిజ్‌లోనుంచి రసగుల్లా డబ్బాలివతలికి వచ్చాయి. అందమైన గాజు బౌల్‌లో చల్లటి బాసుంది నిండింది. స్వీటు ప్యాకెట్లలోని స్వీట్లు పళ్ళాలలో సర్దుకున్నాయి. మధ్యమధ్యలో ఫ్లవర్‌వాజులూ వాటిల్లో తాజా పూలూ గుబాళించడానికి మేము తయారంటున్నాయి.

ఫైనల్ టచ్‌గా పర్యవేక్షించటానికొచ్చినట్లున్నారు లలితాంబగారు- "నీకసలు బుద్ధుందా కస్తూరీ. ముందా పింగాణీ ప్లేట్లు టేబుల్ మీద తీసెయ్. వస్తున్నదెవరనుకున్నావ్, వీవీవపీలు... ఆ... ఏమనుకున్నావో - ఇవిగో వెండిసామాను, శుభ్రంగా కడిగి ఆ ఫ్లానల్ క్లాతుతో తుడిచి టేబుల్‌మీద సర్దు" అంటున్నారు తీక్షణంగా.

వింటున్న అత్తమ్మ మొహం ఒక్కసారిగా నల్లబడింది. మా ముందున్న పింగాణీ ప్లేట్లూ చౌకబారు పదార్థాలూ వెలవెలబోతూ సిగ్గుపడ్డయ్.

"పద వెళ్దాం" అన్నారత్తమ్మ.

ఇవతలికి వచ్చేశాం. ఇంటిముందు అప్పుడే కార్లు ఆగాయి. వచ్చినవారిని పలకరిస్తూ చేతులూ భుజాలూ కలుపుకుంటున్న సందట్లో వెళ్ళొస్తామన్న మా మాటల్ని పట్టించుకోనే లేదు లలితాంబగారు.

ఆటోలో సీటుకానుకుని లంకణాలు చేసినట్టు వేలాడబడి కూర్చుండిపోయారత్తమ్మ. "ఎంత పొగరు. కాస్త ఐశ్వర్యం పేరుకునేసరికి ఒక్క మెట్టు కిందున్నవాళ్ళంటే అంత చిన్నచూపా. అంత తీసిపోయామా మనం. ఎంత అహంకారం" అత్తమ్మ నిస్సహాయతతో కూడిన ఆవేశమది.

ఆవిడ అవస్థకి జాలిపడాల్సిందేగానీ అవకాశాన్ని వదలబుద్ధవలేదు. "బాధపడుతున్నారా అత్తమ్మా. మీరన్నదే కదా 'చాతుర్వర్ణం మయా సృష్టం' అని పరమాత్ముడన్నాడని. ఆ కాలంలో నాలుగు వర్ణాలు అంటే నాలుగు కులాలు. ఈ కాలంలో రెండే వర్ణాలు. అవే అంతస్తులు... ఉన్నవాళ్ళు, లేనివాళ్ళు అని. మనకు ముట్టవలసినంత గౌరవాన్నే మనకు ముట్టజెప్పారు లలితాంబగారు. ఇక్కడ స్నేహితులకీ బంధుత్వాలకీ విలువుండదు. కృష్ణపరమాత్మే ఒప్పుకున్న ధర్మమిది. కాదనటానికి మనమెవ్వరం."

అత్తమ్మ మొహంలో నెత్తురుచుక్కలేదు.

ఆ తరవాత ఆవిడ మారిపోయారా అని మాత్రం నన్నడక్కండి.

అయినా ఒక్క మాటతో అజ్ఞానం తొలగిపోడానికి మనమేమన్నా ఆదిశంకరులమా! ★

